సాక్షి నిర్మల్

ఆదివారం । 26 । నవంబర్ । 2023



ఓటే.. భవితకు భరోసా

భారత రాజ్యాంగంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజ్యాంగం నగటు పౌరునికి ఓటు అనే వజ్రాయుధం అందించింది. 6లో▸



పోస్టల్ బ్యాలెట్ గందరగోళం

జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేటాయించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లిస్టులో తమ పేరు లేదని పలువురు శనివారం ఆందోళనకు లోనయ్యారు. 6లో▸

గరిష్టం/కనిష్టం 30.0 /21.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. గాలిలో తేమశాతం పెరిగి చల్లగా అనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పోస్టల్ ఓటు వినియోగంలో ఇబ్బందులు లేవు



పోస్టల్ ఓట్లు వేస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌చైన్‌గేట్: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు లేవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శిక్షణలో తమ ఓటు హక్కును వినియోగించుకోలేని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు శనివారం స్థానిక సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో కేటాయించబడిన పోలింగ్ కేంద్రంలో 1,050 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోలేని వారు ఆదివారం ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్ద ఫెసిలిటేషన్ కేంద్రంలో వినియోగించుకోవచ్చని తెలిపారు.

సప్లిమెంటరీ కంట్రోల్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈవీఎం గోదాంలో ఏర్పాటు చేసిన సప్లిమెంటరీ కంట్రోల్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు రవి రంజన్‌కుమార్ విక్రమ్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం పూర్తి చేశారు. నిర్మల్‌కు 110, ఖానాపూర్‌కు 90, ముధోల్‌కు 103 చొప్పున కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఈవీఎం గోదామును పరిశీలించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చేపపిల్లల విడుదల



చేప పిల్లలను విడుదల చేస్తున్న సిబ్బంది

కడెం: కడెం ప్రాజెక్ట్‌లో శనివారం చేప పిల్లలను విడుదల చేసినట్లు ఫిషరీస్ ఎఫ్‌డీవో సుమలత తెలిపారు. 18 లక్షల చేప పిల్లలు, 3 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులో చేప పిల్లలను సక్రమంగా విడుదల చేయడం లేదని, అధికారుల నిర్లక్ష్యంతో తమకు అన్యాయం జరుగుతోందని స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్పీ



ఓటేసిన ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో శనివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈనెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

ఓటు.. పాట్లు



అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకుంది. దీంతో అభ్యర్థులతోపాటు పార్టీల నాయకులు వినూత్న ప్రచారం చేస్తున్నారు. లక్ష్మణచాంద మండలం పార్‌పల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఓ ఇంట్లో చిన్నారికి స్నానం చేయించి ఓటు అభ్యర్థించారు.

- లక్ష్మణచాంద



సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

ఆరు గ్యారంటీలపై.. తొలి సంతకం



కాంగ్రెస్ సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ

- బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే
- ఆ రెండు పార్టీలను ఓడించాలి
- రాహుల్ గాంధీ పిలుపు
- పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచిన ఏఐసీసీ అగ్రనేత
- ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ విజయభేరి సభ సక్సెస్

సాక్షి,ఆదిలాబాద్: 'బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే.. ఈ రెండు పార్టీలకు మూడో దోస్తు ఎంఐఎం.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించాలని..' కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల స్కీంలపైనే తొలిసంతకం పెట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభకు ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి ఎందుకు తీసుకురావాలో వివరించారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రధానంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరుపై తీవ్రస్థాయిలో విమర్శించారు. ఏ ఆశయాలతో తెలంగాణ ఏర్పడిందో ఆ స్వప్నాన్ని నాశనం చేశారంటూ బీఆర్‌ఎస్‌పై ధ్వజమెత్తారు. దొరల తెలంగాణను పారదోలి ప్రజల తెలంగాణను ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే కేంద్రంలోని మోదీప్రభుత్వం సైతం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజల ఆశయాలను కాంగ్రెస్ నెరవేరుస్తుందని భరోసా ఇచ్చారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం రాహుల్‌ను పలువురు సన్మానించారు.

భారీగా జన సమీకరణ..

ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో కాంగ్రెస్ విజయభేరి సభ శనివారం నిర్వహించారు. మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో రాహుల్ గాంధీ ఆదిలాబాద్ చేరుకున్నారు. నియోజకవర్గం నుంచి భారీగా జనంతరలివచ్చారు. హెలీప్యాడ్ నుంచి నేరుగా బహిరంగ సభస్థలికి వాహనంలో చేరుకున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాశ్, ఆదిలా బాద్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ అభ్యర్థి ఆడె గజేందర్, సీనియర్ నేతలు గోవర్ధన్‌రెడ్డి, నరేశ్ జాదవ్, భరత్‌వాఘ్మారే, సైద్‌ఖాన్, శ్రీధర్ భూపెల్లి, సంతోశ్ రావు, రూపేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ గణేశ్ రెడ్డి, ఎస్టీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి శాంతకుమారి, డేర కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సుమారు గంట పాటు సభలో ఉన్న రాహుల్ ప్రసంగం తర్వాత బయల్దేరి వెళ్లారు.

మహిళ, చిన్నారిని వేదికపైకి పిలిచి..

రాహుల్ తన ప్రసంగం మధ్యలో ఆరు గ్యారంటీల స్కీంలపై ప్రస్తావిస్తూ సభలో ఉన్న ఓ మహిళ, చిన్నారిని వేదికపైకి రావాలనిఆహ్వానించారు. ఆ చిన్నారితో కార్డులోని ఆరు గ్యారంటీ స్కీంలను చదివిస్తూ వాటి అమలు ద్వారా తెలంగాణ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. గృహజ్యోతి, రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, యువవికాసం పథకాల ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ఈ పథకాలను తీసుకొస్తున్నామన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి తొలిసంతకం దీనిపైనే ఉంటుందని వివరించారు. రాహుల్ సభ సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.



ఆరు గ్యారంటీ పథకాలను చిన్నారి చెబుతుండడంతో ఆసక్తిగా వింటున్న రాహుల్

బీజేపీ శ్రేణుల్లో జోష్



వేదికపై యూపీ సీఎం యోగి, బీజేపీ అభ్యర్థులు హరీశ్‌బాబు, ఆత్మారాంనాయక్, తదితరులు

- రామరాజ్య స్థాపన సంకల్ప సభకు తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడామైదానం
- రాష్ట్రంలో తొలి ప్రచారసభలో పాల్గొన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

కాగజ్‌నగర్‌టౌన్/కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన రామరాజ్య స్థాపన సంకల్ప సభ బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆశించిన స్థాయిలో జనం తరలిరావడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం) క్రీడామైదానం కిక్కిరిసిపోయింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ ఫైర్ బ్రాండ్ యోగి ఆదిత్యనాథ్ తెలంగాణ రాష్ట్రంలో పాల్గొన్న తొలి ప్రచార సభకు పార్టీ శ్రేణులతోపాటు బెంగాలీ క్యాంపుల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 1.20 గంటలకు హెలికాప్టర్‌లో ఆయన ఎస్పీఎం మైదానానికి చేరుకున్నారు. సభ ప్రాంగణం పక్కనే ఏర్పాటు చేసిన స్టేజీపై కళాకారులు ఆటపాటలతో హోరెత్తించారు. హర్‌ఘర్ మోదీ... యోగి.. మోదీ.. జైశ్రీరాం బోలేగా... అనే పాటలకు సభికులు స్టెప్పులు వేస్తూ కనిపించారు. ఉదయం పొగమంచు, చలితో ఉన్న వాతావరణం 10 గంటల తర్వాత ఒక్కసారిగా మారింది. ఎండవేడి పెరగడంతో ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. ప్రసంగాలు త్వరగా ముగించాలని సభాధ్యక్షుడు కోరడంతో వక్తలు తక్కువ సమయమే మాట్లాడారు. సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబుకు మీ ఓటు వేసి సహకారం అందించాలని యోగి తెలుగులో కోరారు. నిధులు, నీళ్లు, నియామకాలు అంటూ తెలుగులో చదివి.. వాటిని అమలు చేయకపోవడంపై హిందీలో విమర్శలు చేయడం ఆకట్టుకుంది. ప్రసంగం మొత్తం హిందీలోనే సాగినా ప్రజలను ఆకట్టుకునేందుకు అప్పుడప్పుడు తెలుగులోనే మాట్లాడారు. స్థానిక నేతలను ప్రస్తావించకుండా పార్టీ పేర్లు ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. చివరగా అయోధ్యలో రామాలయం ప్రారంభిస్తున్నామని, మీరందరూ రావాలని సభికులను ఆహ్వానించి ప్రసంగాన్ని ముగించారు. ఎస్పీ కె.సురేశ్‌కుమార్, కాగజ్‌నగర్ డీఎస్పీ ఎ.కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ వద్దకు వెళ్లే సమయంలో పాల్వాయి హరీశ్‌బాబు స్థానిక నేతలను యోగి ఆదిత్యనాథ్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, వణి, చిమూర్ ఎమ్మెల్యేలు సంజీవ్‌రెడ్డి, బంటి భాంగడియా, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మితో పాటు స్థానిక, జిల్లా నేతలు పాల్గొన్నారు.

'ప్రాణహిత' పూర్తి చేస్తాం

- పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తాం
- బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి
- సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు



సభలో మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీని గెలిపిస్తే ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని, తద్వారా ఈ ప్రాంతంలో 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ఆపార్టీ సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 100 గ్రామాలకు రవాణా సౌకర్యం లేదని, అటవీ శాఖ అనుమతుల పేరుతో రోడ్లు నిర్మించలేదని ఆరోపించారు. బీజేపీకి అవకాశం ఇస్తే 100 గ్రామాలకు రోడ్లు వేస్తామని, ఎస్పీఎంలో నాలుగు వేల మంది స్థానికులకు ఉపాధి కల్పిస్తానని భరోసా ఇచ్చారు. కాగజ్‌నగర్‌లో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. పోడు భూముల విషయంలో రైతులకు అన్యాయం జరిగిందని, తాను కూడా 40 రోజుల జైలుజీవితం గడిపినట్లు గుర్తు చేశారు. కేంద్రంతో మాట్లాడి పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈజ్‌గాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ పాలనలో తాలుకా ఆగమైందని, ప్రజలు గంపగుత్తగా బీజేపీకి ఓటు వేసి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.

ఫాంహౌస్ సీఎం కావాలా.. పనిచేసే సీఎం కావాలా?

- పనిచేయని వారికి ఓట్లు అడిగే హక్కు లేదు
- బీజేపీ, బీఆర్‌ఎస్ తెరవెనుక రాజకీయాలు
- లిక్కర్ కేసులో కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదో మోదీ చెప్పాలి
- కాంగ్రెస్ ప్రచార కమిటీ చీఫ్ కోఆర్డినేటర్ విజయశాంతి
- సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో ప్రచారం..




సారంగాపూర్‌లో మాట్లాడుతున్న విజయశాంతి

సారంగాపూర్/దిలావర్‌పూర్: రాష్ట్ర ప్రజల బాగోగులు చూస్తూ, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా పయనింపజేసే ముఖ్యమంత్రి కావాలో.. లేక సచివాలయానికి రాకుండా, ఫాంహౌస్‌లో ఉండే ముఖ్యమంత్రి కావాలో ప్రజలు తేల్చుకోవాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ చీఫ్ కోఆర్డినేటర్, ప్లానింగ్ కమిటీ కన్వీనర్ విజయశాంతి ఓటర్లకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నిర్మల్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావుతో కలిసి సారంగాపూర్ మండలం సారంగాపూర్, బీరవెల్లి, దిలావర్‌పూర్ మండల కేంద్రంలో శనివారం ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ పార్టీల అధినేతలు మోదీ, కేసీఆర్ తెరచాటు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మభ్యపెట్టి పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి హామీలు హామీలుగానే మిగిలిపోయాయన్నారు. దళితబంధు, బీసీ బంధు, మైనారిటీబంధు గులాబీ నేతలకు ఇచ్చారన్నారు. లక్షల కోట్లు దోచుకున్నా ఇంకా కేసీఆర్ అవినీతి దాహం తీరలేదన్నారు. లిక్కర్ స్కాంలో ఉన్న తన కూతురును కాపాడుకోవడానికి కేసీఆర్ బీజేపీతో లాలూచీ పడ్డారన్నారు. కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదో మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కుతో దొరల పాలనను తరిమికొట్టాలని కోరారు. దిలావర్‌పూర్ సమీపంలో గుండంపల్లి గ్రామ పరిసరాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ కర్మాగారం విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు తోడు దొంగలని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇథనాల్ ఫ్యాక్టరీని నిలిపి వేస్తామన్నారు. అలాగే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఆమె ప్రజలకు వివరించారు. నిర్మల్ ఎమ్మెల్యేగా శ్రీహరిరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రడ్డి, అర్గుల రమణ, కట్కం రాజారెడ్డి, సయ్యద్‌యూసుఫ్, కోడె శ్రీనివాస్, తక్కల విద్యాసాగర్‌రెడ్డి, తెడ్డుగోపాల్, బొల్ల దయాకర్, రావుల దేవిదాస్, బెల్లాజి రాజు, షఖ్ వసీం, కోడె మనేష్, షఫీయొద్దీన్, దశరథ రాజేశ్వర్, మారుతీ, నర్సయ్య, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖానాపూర్‌లో సీఎం సభ

- ఏర్పాట్లు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు
- జనసమీకరణలో నేతల దృష్టి

ఖానాపూర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదివారం ఖానాపూర్‌కు వస్తున్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వెనుక గల మైదానంలో నిర్వహించే ప్రజాఆశీర్వాద సభలో పాల్గొంటారు. ఈమేరకు నాయకులు ఏర్పాట్లు చేశారు. సాయిబాబా ఆలయం ముందు ఉన్న మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రవీందర్‌రావు

సీఎం సభ ఏర్పాట్లు పరిశీలన

పట్టణంలోని జేకే నగర్‌లో ఆదివారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు పైడిపెల్లి రవీందర్‌రావు శనివారం పరిశీలించారు. సీఎం కేసీఆర్ హాజరయ్యే ఈ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం సాయిబాబా ఆలయం ఎదుట మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని సందర్శించారు. అనంతరం స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌తోపాటు ఎమ్మెల్సీ దండె విఠల్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ పూర్ణచందర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రాజేందర్, పార్టీ శ్రేణులు, తదితరులతో కలిసి క్యాంపు కార్యాలయంలో ఏర్పాట్లపై సమీక్ష చేశారు.

ప్రధాని సభకు భారీ బందోబస్తు



సభా ప్రాంగణం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్

- ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ ఆధీనంలో సభాస్థలి
- నిఘా నీడలో నిర్మల్

నిర్మల్‌టౌన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం జిల్లా కేంద్రానికి రానున్నారు. స్థానిక ఎల్లపల్లి క్రషర్ రోడ్డు సమీపంలో సభ నిర్వహించనున్నారు. దీంతో పోలీసులు అడుగడుగునా బందోబస్తు ఏర్పాటు చేశారు. సభాస్థలిని ఎస్పీజీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ శనివారం సాయంత్రమే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఎస్పీజీ అధికారులు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. వాయుసేనకు చెందిన హెలికాప్టర్ ఏరియల్ సర్వే నిర్వహించింది. సభాస్థలి నుంచి మూడు కిలోమీటర్ల పరిసరాలను తనిఖీ చేశారు.

వెయ్యి మందికిపైగా పోలీసులు

బందోబస్తు విధుల కోసం సుమారు ఐదు జిల్లాల నుంచి పోలీసులు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఎల్లపల్లి క్రషర్ రోడ్డు బయటి ప్రాంతం జిల్లా పోలీసుల ఆధీనంలో ఉంది. సభాస్థలి నుంచి సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో 1000 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీజీ అధికారులతో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హెలీప్యాడ్‌ను పరిశీలించారు. శనివారం సాయంత్రం ఎస్పీజీ అధికారులు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని కాన్వాయ్ ట్రయల్‌రన్ నిర్వహించారు.

ట్రాఫిక్ ఆంక్షలు

- మంచిర్యాల చౌరస్తా నుంచి కనకాపూర్ వరకు
- కడ్తాల్ వై జంక్షన్ నుంచి సింగ్ ఇజ్ కింగ్ దాబా వరకు
- విశ్వనాథ్ పేట నుండి ఎల్లపల్లి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నాయి.
- ఖానాపూర్, మంచిర్యాల నుంచి వచ్చే సాధారణ ప్రజలు అక్కాపూర్ చౌరస్తా నుంచి వెంకటాపూర్ మీదుగా మంచిర్యాల చౌరస్తాకు చేరుకోవాలి.
- నిర్మల్ నుంచి ఖానాపూర్ వెళ్లేవారు శాంతినగర్ ఎక్స్ రోడ్ నుంచి అక్కాపూర్ రాచాపూర్, కనకాపూర్ మీదుగా వెళ్లాలి.

వాహనాల పార్కింగ్ ఇలా..

- సారంగాపూర్ నుంచి వచ్చేవారు మంచిర్యాల చౌరస్తా నుంచి శాంతినగర్ మీదుగా గాయత్రి టౌన్‌షిప్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో వాహనాలు పార్కింగ్ చేయాలి.
- ఖానాపూర్, మంచిర్యాల, జగిత్యాల నుంచి వచ్చేవారు కొండాపూర్ బ్రిడ్జి కింద నుంచి అపర్ణ వెంచర్ వరకు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- ఆదిలాబాద్, బోథ్ నుంచి వచ్చే వాహనాలకు ఎల్లాపల్లి, కొండాపూర్ బస్టాండ్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- హైదరాబాద్, నిజామాబాద్, ఆర్మూర్, సోన్ నుంచి వచ్చేవారు నేరుగా కొండాపూర్ బ్రిడ్జి దిగకుండా అపర్ణ వెంచర్ వద్ద పార్కింగ్ చేయాలి.
- సారంగాపూర్ నుంచి వచ్చేవారు విశ్వనాథ్‌పేట్, బంగాల్‌పేట్ మీదుగా కాకుండా మంచిర్యాల చౌరస్తా మీదుగా రావాలి.

క్లుప్తంగా

సీఎం సభలో ఆందోళనకు సన్నద్ధం.?



పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన కరపత్రాలు

కడెం: ఖానాపూర్‌లో ఆదివారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభలో ఆందోళన వ్యక్తం చేసేందుకు నియోజకవర్గ నాయకులు సిద్ధమవుతున్నారు. 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ఆ హామీలతో పాటు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలతో కూడిన కరపత్రాలను సభలో పంపిణీ చేయనున్నారు. అలాగే సదర్‌మాట్ రైతాంగం ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

గంజాయి పట్టివేత



గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని తాండ్ర గ్రామంలో బామన్ రవీందర్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేర కు ఎస్సై మనోహర్ సిబ్బందితో దాడిచేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నాడు. పక్కా సమాచారం మేరకు రవీందర్ చేనులో తనిఖీలు చేపట్టగా 2కిలోల ఎండు గంజాయి, గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపాడు. ఎవరైనా గంజాయి మొక్కలు సాగు చేసినా, విక్రయించినా వారిపై చట్ట రీత్యా చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

రూ.2.50లక్షల నగదు పట్టివేత

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద కారులో తరలిస్తున్న రూ.2.50లక్షల నగదును సీజ్ చేసినట్లు వన్ టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... ఒడిస్సాకు చెందిన బసంత మహారాణ తన కారులో తమిళనాడు వైపు వెళ్తున్నాడు. చెక్‌పోస్ట్ వద్ద అతడి వాహనాన్ని తనిఖీ చేయగా రూ.2.5 లక్షల నగదు లభించింది. ఈ నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసి, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపాడు.

బీఆర్ఎస్‌కే మాలల మద్దతు

ఎదులాపురం: రాష్ట్రంలోని మాలలు బీఆర్ఎస్‌కే మద్దతు తెలపాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. రాష్ట్ర రాజధానిలో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని స్థాపించడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. రాష్ట్ర నూతన సచివాలయానికి అంబేడ్కర్ నామకరణం చేయడం శుభ సూచికంగా భావిస్తున్నామన్నారు. దళితబంధు పథకంతో దళితులు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందేందుకు దోహదం చేసిందన్నారు. జిల్లా మాల సంఘం నాయకులు నల్ల రాజేశ్వర్, సుధీర్, స్వరూపరాణి, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటే.. భవితకు భరోసా

- రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు..
- ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు రాజ్యాంగమే
- బాధ్యతగా ఓటువేస్తేనే..
- నేడు భారత రాజ్యాంగ దినోత్సవం...

నిర్మల్‌ఖిల్లా: భారత రాజ్యాంగ వ్యవస్థ సగటు పౌరునికి అందించిన వజ్రాయుధమే ఓటు హక్కు. భారత రాజ్యాంగ వ్యవస్థలో ప్రజాస్వామ్యయుతంగా ఉన్నటువంటి ఎన్నికల ప్రక్రియకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నేడు నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఇదీ నేపథ్యం...

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. విద్యావేత్తలు, న్యాయనిపుణులు, వివిధ రంగాల ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడానికి రెండేళ్ల 11నెలల 18రోజుల సమయం పట్టింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగం రూపొందింది. భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది. ఆ రోజున గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆ రాజ్యాంగానికి మాత్రం గణతంత్ర దినోత్సవానికి సరిగ్గా రెండు నెలల ముందు అంటే 1949 నవంబర్ 26న ఆమోదముద్ర పడింది.

2015 నుంచే ఎందుకంటే..

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న జన్మించగా 1956 డిసెంబర్ 6న కన్నుమూశారు. 125వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ వేసింది. ఆ కమిటీ ఏడాదిపాటు ఉత్సవాలు నిర్వహించింది. అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగా అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించారు. ఆ క్రమంలో 2015 అక్టోబర్‌లో ముంబయిలోని అంబేద్కర్ జ్ఞాపిక వద్ద పునాది రాయి వేస్తూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాజ్యాంగ దినోత్సవ ప్రకటన చేశారు. అప్పటి నుంచి ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని సంవిధాన్ దివస్‌ అని కూడా పిలుస్తారు.



భారత రాజ్యాంగ పీఠిక

ఓటుహక్కు ప్రస్థానం ఇదీ..

భారత రాజ్యాంగం పౌరులందరికీ సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించింది. 1907లో ఏర్పడిన రాయల్ కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఓటు హక్కుపై చేసిన సిఫారసుల ఆధారంగా 1909 కౌన్సిల్ చట్టం ప్రాతిపదికన భారతీయులకు ఓటు హక్కు కల్పించారు. 1919 కౌన్సిల్ చట్టం ఈ హక్కును కొంతమేర విస్తృత పరిచింది. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా ఈ హక్కును 10.6 శాతం పౌరులకు కల్పించారు. రాజ్యాంగ పరిషత్, ఎన్నికల సందర్భంగా 28.5శాతం ప్రజలకు విస్తరింపచేశారు. ప్రజాస్వామ్యంలో సమానత్వ సూత్రాన్ని అనుసరించి 325 అధికరణం ప్రకారం ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉంటుంది. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి కేంద్ర ప్రభుత్వం ఓటు హక్కు వయో పరిమితిని 21ఏళ్ల నుంచి 18ఏళ్లకు తగ్గించి అత్యంత ప్రాధాన్యం కలిగిన హక్కుగా ప్రాముఖ్యతను చేకూర్చింది.

అతి పెద్ద రాజ్యాంగం మనదే..



ప్రపంచంలోకెల్లా భారతదేశ రాజ్యాంగం అతిపెద్దది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచన కమిటీ ఆధ్వర్యంలో అతిరథ మహారథులైన నాయకులు కలిసి రూపొందించిన ఈ రాజ్యాంగం అనేక హక్కులను ప్రసాదించింది. ప్రజాస్వామ్యబద్ధంగా పాలకులను స్వేచ్ఛగా ఎన్నుకునే హక్కు మన దేశంలోనే ఉంది. ఇంత పెద్ద జనాభా కలిగిన దేశంలోని రాజ్యాంగంలో ఓటుహక్కు వెన్నెముక లాంటిది.

– నకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, పరిపాలనాశాస్త్ర నిపుణులు, నిర్మల్

104 వయసులో బాధ్యతగా ఓటు వేస్తూ..



నా వయసు ప్రస్తుతం 104 ఏళ్లు. ఇప్పటివరకు అన్ని రకాల ఎన్నికల్లో ఓటు వేశాను. వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎంపీ ఎన్నికల వరకూ ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకున్నాను. అయితే ఈసారి వయస్సు పైపడటంతో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇటీవల తన దగ్గరకే వచ్చిన ఎన్నికల అధికారుల సమక్షంలో ఓటు హక్కును వినియోగించుకున్నాను. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– అన్నపూర్ణబాయి, భైంసా

పోస్టల్ బ్యాలెట్ గందరగోళం

- జాబితాలో కనిపించని ఉద్యోగుల పేర్లు
- అధికారుల వద్ద కొరవడిన స్పష్టత



ఇక్కడ కనిపిస్తున్నది ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లయ్య. బజార్‌హత్నూర్ మండలంలో ఎస్జీటీగా పనిచేసే ఈయనకు ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఓపీఓగా ఎన్నికల విధులు అప్పగించా రు. ఆర్డర్ కాపీ ఇచ్చిన రోజునే పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. శని వారం ఓటేసేందుకు రాగా జాబితాలో పేరు లేదని చెప్పి బోథ్ నియోజకవర్గ ఆర్వో ను సంప్రదించాలని సిబ్బంది సూచించారు.



ఖానాపూర్ నియోజకవర్గంలో ఓపీవోగా ఎన్నికల విధులకు నియామకమైన ఈ ఉపాధ్యాయుడి పేరు బి.గంగాధర్. పోస్టల్ బ్యాలెట్ కోసం ఉట్నూర్‌లో నిర్వహించిన శిక్షణకు హాజరైన సమయంలో దరఖాస్తు చేసుకోన్నాడు. శనివారం ఓటు వేసేందుకు ఆర్వో కార్యాలయానికి రాగా జాబితాలో పేరు లేదని అక్కడి సిబ్బంది చెప్పారు. చేసేది లేక నిరాశగా వెనుదిరిగాడు.

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ గందరగోళం ఆగడం లేదు. ఎన్నికల విధులు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవస్థలు తప్పడం లేదు. ఓటు వినియోగం కోసం వచ్చిన వారు అధికారుల నిర్వాకంతో ఆందోళనకు గురి కావాల్సి వస్తోంది. పీవో, ఏపీవో, ఓపీఓగా ఎన్నికల విధులకు నియామకమైన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు వినియోగం కోసం జిల్లా కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్తున్నారు. వారికి బ్యాలెట్‌ను అందించాల్సిన అధికారులు పోస్టల్ బ్యాలెట్ జాబితాలో మీ పేర్లే లేవని చెప్పడంతో ఖంగు తింటున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు చేసేదేమి లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు అందని వారిలో అత్యధికంగా బోథ్ నియోజకవర్గంలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులే. ఈ నెల 28 వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అవకాశముందని సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాలను సంప్రదించాలని అధికారులు చెబుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ల మిస్సింగ్ అయిన వారికి అవసరమైన సమాచారమందించేందుకు ఆదిలాబాద్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్కు ఏర్పాటు చేశారు.



పేర్లు లేవని ఆందోళనకు దిగిన ఉపాధ్యాయులు

పోస్టల్ ఓటర్ల ఆందోళన

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేటాయించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లిస్టులో తమ పేరు లేదని ఉద్యోగ ఉపాధ్యాయులు శనివారం ఆందోళనకు లోనయ్యారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ హైస్కూల్లో ఉద్యోగ ఉపాధ్యాయులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 1500 మంది దరఖాస్తు చేసుకున్న బ్యాలెట్ ఓట్లలో అధికారులు కేవలం 850 మందికి సంబంధించిన లిస్టును మాత్రమే గోడలపై అతికించారు. కొందరి పేరు లిస్టులో లేకపోయేసరికి ఉద్యోగులు అయోమయానికి గురయ్యారు.



ఆందోళన చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు



పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి క్యూ..

రెండుసార్లు దరఖాస్తు చేసుకున్న

పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటికే రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నాను. ఓటు హక్కు వినియోగించుకుందామని స్థానిక సెయింట్ థామస్ పాఠశాలకు వెళ్లినప్పుడు అక్కడ లిస్టులో నా పేరు లేదన్నారు. తిరిగి రెవెన్యూ అధికారి కార్యాలయానికి వచ్చి వాకబు చేస్తే ఇక్కడ కూడా పేరు లేదంటున్నారు.

– అశోక్, ఉద్యోగి

అందరికీ ఓటు అందేలా చూడాలి

దరఖాస్తు చేసుకున్న ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పోస్టల్ బ్యాలెట్ అందేలా చూడాలి. 15 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్న ఉద్యోగ ఉపాధ్యాయులందరూ లిస్టులో పేర్లు లేక నిరాశకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– పెంట అశోక్, టీఎస్ యూటీఎఫ్ జనరల్ సెక్రెటరీ



ఆర్డీవో కార్యాలయంలో ఓటు కోసం ఉద్యోగులు..



ఓటు వేస్తున్న ఉద్యోగి

అయోమయం..!

భైంసాటౌన్: పోస్టల్ బ్యాలెట్ పత్రాలు అందకపోవడంతో పలువురు ఉద్యోగులు అయోమయం చెందుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విధుల నిమిత్తం వచ్చిన ఉద్యోగులు వారివారి నియోజకవర్గాల్లో ఓటు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ కోసం భైంసాలోని ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. గడువు ముగిసినా పలువురికి బ్యాలట్ పత్రాలు అందకపోవడంతో ఓటు వినియోగించుకోలేకపోతున్నారు. పోస్టల్ బ్యాలెట్ అందినవారు శిక్షణ సమయంలోనే అక్కడ ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలియేషన్ కేంద్రంలో ఓటు వేశారు. కాగా, కొంతమందికి పోస్టల్ బ్యాలెట్ రాకపోవడంతో భైంసాలోని ఆర్డీవో కార్యాలయానికి వచ్చి తమ ఓటు వచ్చిందా అని వాకబు చేయడం కనిపించింది. పోస్టల్ బ్యాలట్ ఇన్‌చార్జి ఎజాజ్‌ఖాన్‌ను వివరణ కోరగా, 90 నియోజకవర్గాలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, కొందరికి బ్యాలట్ పత్రాలు అందడంలో జాప్యం నెలకొంది. అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శనివారం 76మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం..

ఖానాపూర్: ఇటీవల బాసరలో ఎన్నికల విధుల్లో భాగంగా పోస్టల్‌బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించకపోవడానికి కారణమైన అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరిన విషయం తెలిసిందే. సంఘం నాయకుల పత్రిక ప్రకటనతో కదిలివచ్చిన అధికార యంత్రాంగం జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం కల్పించింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట్‌రావు, రవీందర్, నెహ్రు, ప్రతాప్‌సింగ్, రమేశ్, జరీనాబేగం, అనిల్, ఉన్నారు.



ఓటు వేసినట్లు చూపుతున్న ఉపాధ్యాయులు

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

భైంసారూరల్: భైంసా – నిర్మల్ ప్రధాన రహదారిపై ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి ముద్దం మహేశ్(28) మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం... మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి మహేశ్ శుక్రవారం రాత్రి బయటకువెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్‌చేసిన సమాధానం రాలేదు. శనివారం ఉదయం మాటేగాం టోల్‌ప్లాజా సమీపంలో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి కనిపించాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకులు వెళ్లేవరకు మృతిచెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించాడు.

ఒకరికి గాయాలు



గాయాలపాలైన లక్ష్మణ్

నేరడిగొండ: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెలితే... మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన లక్ష్మణ్ ఓ గుత్తేదారు వద్ద కూలీ పనుల చేస్తున్నాడు. వారసంత ఉండటంతో కాలినడకన నేరడిగొండ వైపు వస్తుండగా మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో నిర్మల్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని పాంఢ్రకవడలోని చినార్లి గ్రామానికి చెందిన చందల్‌వార్‌దేవ్‌గా(72) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... చందల్‌వార్‌దేవ్‌కు ఒక కన్ను సరిగ్గా కనిపించడం లేదు. ఈ క్రమంలో బీడీ వెలిగించుకునే క్రమంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబీకులు మంటలు ఆర్పివేసి శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పాడు.

ప్రతిభగల యువకులంతా భారతీయులే



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా. సతీశ్‌రెడ్డి



పాల్గొన్న విద్యార్థులు

భైంసా: ప్రతిభ గల యువకులంతా మన భారతీయులేనని డీఆర్డీవో మాజీ చైర్మన్, రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో నేషనల్ సర్వీస్‌స్కీమ్ కలాం ఇనిస్టిట్యూషన్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెంట్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నది ట్రిపుల్‌ఐటీనేనని కొనియాడారు. విద్యార్థులకు సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడి అని సూచించారు. 2047 నాటికి ప్రపంచం భారతదేశంవైపు చూసేలా మన యువతలో నైపుణ్యం ఉందన్నారు. గతంలో ఇతర దేశాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వెళ్లేవారని ఇప్పుడు ఇతర దేశాలే మన దేశానికి వచ్చి పెట్టుబడులు పెట్టి నూతన సంస్కరణలకు తెరలేపుతున్నాయన్నారు. అబ్దుల్‌కలాం వంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌గంగ తీరంలో కోటి దీపోత్సవం



పెన్‌గంగ నదికి హారతి ఇస్తున్న భక్తులు



పెన్‌గంగలో దీపాలు వదులుతున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ శివారులోని పెన్‌గంగ నది తీరంలో శనివారం రాత్రి కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్లి(టి) రామాలయం వ్యవస్థాపకులు శివానంద భారతీ స్వామి ఆధ్వర్యంలో పెన్‌గంగ నదీతీరంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెన్‌గంగ నదికి హారతి అనంతరం గంగనదిలో భక్తులు దీపాలను వదిలారు. భక్తులు వదిలిన కోటి దీపాలతో పెన్‌గంగ నది కార్తీక శోభను సంతరించుకుంది. కోటి దీపోత్సవ కార్యక్రమానికి వడూర్, అర్లి(టి), ధనోర, భీంపూర్, కరంజితో పాటు మహారాష్ట్రలోని చిన్నార్లి, సాంగి, కుర్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో నదితీరం కిటకిటలాడింది. గ్రామసర్పంచ్ హనుమాన్‌దాస్, గ్రామపెద్ద చిల్కూరి సంజీవ్‌రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటస్వామి, ఎంపీటీసీ భోజన్న ఉన్నారు.

మన పండరీపురం..

- విఠలేశ్వర జాతరకు ఏర్పాట్లు పూర్తి
- ఆలయంలో నెలరోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు
- నేటి నుంచి తానూరులో జాతర
- తరలిరానున్న భక్తులు
- మల్లయోధులకు కుస్తీపోటీలు

తానూరు: మహారాష్ట్రలోని పండరపురం విఠలేశ్వర ఆలయంలో జరిగే కార్యక్రమాలు కార్తీక మాసంలో ఇక్కడి తానూరులోని విఠలేశ్వర ఆలయంలో కొనసాగుతాయి. ఈసారి సైతం ఆలయ కమిటీ సభ్యులు జాతరకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. ఆది, సోమవారాల్లో విఠలేశ్వరుని ఆలయంలో జరిగే జాతరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ ఏడాదితో 105ఏళ్లు పూర్తికావడంతో ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

పల్లకి ఊరేగింపులు..

ఆలయంలో కార్తీక మాసంలో మొదటి ఏకాదశి నుంచి ఇక్కడ వేడుకలు ప్రారంభం కావడంతో పల్లకి ఊరేగింపు కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. విఠలేశ్వర మాలధారులు ఆలయంలో నిత్యం భజనలు చేస్తున్నారు. స్వామి వారికి సాయం, సంధ్య వేళల్లో ప్రత్యేక మంగళహారతులు ఇస్తున్నారు.

స్వామివారి రథం ఊరేగింపు...

విఠలేశ్వర స్వామి వారికి ఏటా జాతర సందర్భంగా కార్తీక చతుర్థి పౌర్ణమి ఆదివారం రాత్రి 12గంటలకు రథోత్సవం ఉంటుందని ఆలయ పూజారి పింటు మహరాజ్ తెలిపారు. రథాన్ని గ్రామస్తులు, భక్తులు తాళ్లతో లాగుతూ ప్రధాన వీధుల ఉండా ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. రథాన్ని లాగితే మస్సులో మొక్కుకున్న కోరికలు నెరవేరుతాయన్న నమ్మకం భక్తుల్లో ఉంది. అయితే కార్తీక మాసం నెల రోజులుగా మహా రాష్ట్రలోని పండరపురంలోని విఠలేశ్వరుని ఆలయంలో నిర్వహించే భక్తి కార్యక్రమాలు తానూర్‌లోని ఆలయంలో నిర్వహిస్తారు. దీంతో ఇక్కడి ప్రజలు మరో పండరపురం తానూరుగా భావిస్తారు.

హరినామ సప్తాహం ...

ఈ ఏడాదితో జాతరకు 105 ఏళ్లు పూర్తికాడంతో ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో వారం రోజుల పాటు అఖండహరి నామ సాప్తహం కొకసాగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తి కార్యక్రమాలు సాగుతాయి. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



ఆలయ ముఖద్వారం



విఠల రుక్మాయి ఉత్సవమూర్తులు

జాతరకు ఏర్పాట్లు పూర్తి...

ఆదివారం కార్తీక పౌర్ణమి ఉత్సవాల కోసం ఆలయ కమిటీ జాతరకు ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ జాతరకు మండల కేంద్రంతో పాటు ముధోల్, భైంసా, కుభీర్, మహారాష్ట్రలోని ధర్మాబాద్, నాందేడ్, భోకర్ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ కమిటీ, ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది.

అంతర్రాష్ట్ర మల్లయోధులకు కుస్తీపోటీలు...

జాతర సందర్భంగా గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 12గంటలకు ఆయా ప్రాంతాల నుంచి వచ్చే మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ప్రథమ బహుమతిగా రూ.11,111వేలు, వెండి కడియం, ద్వితీయ బహుమతిగా రూ.8,851 వెండి కడియంతో బహూకరించి మల్లయోధులను సన్మానిస్తారు.

డబ్బులు పంచిన ఆరుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: రాహుల్ గాంధీ బహిరంగసభకు వచ్చిన కొంతమందికి డబ్బులు పంపిణీ చేసిన ఆరుగురిపై వన్‌టౌన్ ఎస్సై అజీజ్‌ఖాన్ శనివారం కేసు నమోదు చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్‌కు చెందిన గడ్డం వేణుగోపాల్ నుంచి రూ.13వేలు, అడ్డగుట్టకు చెందిన టేకం భీంరావు వద్ద నుంచి రూ.4300, గుమ్మడి గణేష్ నుంచి రూ.11వేలు, బేల మండలం దహెగాంకు చెందిన బాపూరావు నుంచి రూ.7800, అదే గ్రామానికి చెందిన మడావి చంద్రకాంత్ నుంచి రూ.6200, బొర్కర్ శంకర్ నుంచి రూ.3వేల డబ్బులు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లుగా వివరించారు. వీరంతా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి పట్టణంలోని వినాయక్‌చౌక్ వద్ద డబ్బులు పంపిణీ చేస్తుండగా పట్టుబడ్డారని వివరించారు.

మరో వ్యక్తిపై కేసు..

జిల్లా కేంద్రంలోని నిర్వహించిన రాహుల్ గాంధీ సభకు హాజరైన వారికి డబ్బులు పంపిణీ చేసిన జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామానికి చెందిన అల్లూరి నారాయణరెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.8250 స్వాధీనం చేసుకున్నట్లు టుటౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. బస్టాండ్ సమీపంలో డబ్బులు పంచుతుండగా ఆయనను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపాడు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన స్విమ్మర్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. రంగారెడ్డిలో జరిగిన పోటీల్లో అండర్–14 బాలుర విభాగంలో 50 మీటర్ల బట్టర్ ఫ్లై ఈవెంట్‌లో రితేష్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నట్లు ఈత శిక్షకుడు కొమ్ము కృష్ణ తెలిపాడు. రితేష్‌ను జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.



విజేతగా నిలిచిన రితేష్